# కన్నాడీ



డాక్టర్ పరచూరి
రాజారాం

వాడు మూగవాడు. పధ్నాలుగేళ్ళ పసివాడు. ఏవేవో కొన్ని శబ్దాలు చేస్తాడు. మనం అర్థం చేసుకోవాలి.

తల్లీ తండ్రీ ఎవరూ లేరు. ప్లాట్‌ఫారం మీదో, ఫుట్‌పాత్ మీదో పడుకుంటాడు. చెప్పాపెట్టకుండా పనివాళ్ళు వెళ్ళిపోతే కప్పులు కడిగేందుకు పార్కులోనుండి జనాన్ని 'తోలుకెళ్తారు.' అలా ఎవరైనా తోలుకెళ్తే రెండ్రోజులో మూడ్రోజులో పనిచేసేవాడు. తిండి దొరికితే కొన్నాళ్ళు దొరికేది.

ఎక్కువ రోజులు కడుపులో కాళ్ళు పెట్టుకుని పంపునీళ్ళు తాగి పడివుండేవాడు. అప్పుడు పంపుల్లో నీళ్ళు సమృద్ధిగానే దొరికేవి।

ఒక్కోనాడు మరీ ఆకలేస్తే స్టేషన్లో క్యాంటీన్ దగ్గర చెత్తకుండీ ప్రక్కన నిలబడేవాడు. తిన్నమారాజులు పూరీ కూరలో కూర వదిలేసేవారు. అది కుండీలో పడేయొద్దని బ్రతిమిలాడేవాడు. వాడి శబ్దాలకు భాష్యం చెప్పలేక, ఎంగిలి పడేయటానికి ఇష్టంలేకా కుండీలోనే పడేసేవారు. కుక్కల్తో పోటీఃపడి లాగేసి తినేసేవాడు.

తిండి దొరికినా, దొరకకపోయినా, ఒకరోజు వాడు దొంగతనం చేసో చేయకో రక్షకభటులకు దొరికాడు.

అది మొదలు వాడు వాళ్ళకు దొరుకుతూనే వున్నాడు।। ఒకసారి చెంబు దొంగిలించాడు. ఇంకోసారి చెప్పలు

దొంగిలించాడు. మరోసారి చిరుగుల చొక్కా! తుండుగుడ్డ!

మేజిస్ట్రేట్‌గారు చండశాసనుడు! మొదటిసారి వాణ్ణి పట్టించుకోలేదు. చట్టం విద్యుక్తధర్మం మామూలుగా నిర్వహించబడ్డది.

కళ్ళులేని న్యాయస్థానానికి చెవు లుంటాయి. కానీ వినటానికి కోర్టు సిద్ధ పడినా వాడి భాష వేరు! పైగా మూగవాడు శబ్దించే భాష! కళ్ళులేని కోర్టులో నోరు లేని నేరస్తుడు.

ఓహో! దేవుడు దయామయుడు!! వాడికి అలవాటే అయిందో, లేక లెక్కకు కేసులే చాలటంలేధో మూణ్ణెల్లకొకసారి వాడిని హాజరు పెడ్తున్నారు.

రెండవసారి!.... 'మూడవసారి' ........!

మేజిస్ట్రేట్‌గారు దీన్ని మామూలు విషయంగా తీసుకోలేకపోయాడు! అదే అడిగాడు భటుల్ని.

"ఏమిటీ అన్యాయం! ఈ తల్లీ తండ్రీ లేని మూగవెధవా దొరికాడు! ఎందుకు వాణ్ణి ఇబ్బంది పెడతారు?"

"చిత్తం! చిత్తం!" అంటూ నే వున్నారు. అయినా మూగవాణ్ణి అడపా దడపా తీసుకొస్తూనే వున్నారు.

తలపాగా పెట్టుకుని ఒక కాల్లో 'అనె'తో కాళ్ళు ఎత్తెత్తివేసే కోర్టు జవాను 'ఇమామ్' జాలిపడ్డాడు.

మూగవాణ్ణి ఏమిటని అడిగాడు. ఇమామ్‌కు మాత్రమే అర్థమైంది కాబోలు వాడి గోడు!

మేజిస్ట్రేట్‌గారు తలవంచుకుని వ్రాసు కుంటున్నారు.

"అయ్యా!" అన్నాడు ఇమామ్. తలెత్తి చూశారు.

"మూగవాడిని చాలా ఇబ్బంది పెడు తున్నారయ్యా."

"ఏం చేయగలం?" అడిగారు మేజి స్ట్రేట్‌గారు.

"మనింట్లో వాడిని పనికి పెట్టుకుందా మయ్యా!"

"వాణ్ణా! వాడు దొంగ కదూ!" అన్నారు.

"ఏంలేదయ్యా" వీళ్ళకెవడూ దొరక్కపోతే నోరూ.... వాయిలేనివాణ్ణి తీసుకొస్తున్నారు!"

మేజిస్ట్రేట్‌గారు తలెత్తి ఇమామ్ ముఖం వంక చూసారు. "సరే వుండ మను! చూద్దాం!"

మూగవాడు ఇంట్లో పనిచేస్తున్నాడు. అంట్లు తోముతాడు. పాచి వూడుస్తాడు. బూట్లు పాలిష్‌చేస్తాడు. తిండి తింటాడు, పడుకుంటాడు.

మంచి బట్టలు, శుభ్రత అలవడింది. ఆకలి తీరేటప్పటికి కాస్త ఒళ్ళు చేశాడు.

ఇంటి మనుషులతో వాడికి ప్రమేయం లేదు. చిన్నయ్యతో ఆడుకోవాలి! అందుకు పేరక్కర్లేదు. పెద్దయ్యాలు కాలేజీదర్బాలు పోతున్నారు! పనిచెప్తే

చేస్తే చాలు! అమ్మ అన్నం పెడ్తుంది. కనుక "మా" అనో, "బా" అనో, ఆ రెండింటికీ మధ్యగానో పలికేవాడు. చాలు.

కానీ ప్లాట్‌ఫారాల్నుంచి, ఎంగిలి కూటినుంచి, జైళ్ళనుంచి, కటకటాల్నుంచి తనకు దారిచూపిన వాడికి పేరులేకపోతే, చెప్పకపోతే న్యాయం చెయ్యకపోతే ఎట్లా? అమ్మకు, అయ్య పిలుస్తున్నాడని చెప్పాలి. అయ్య పిలుస్తున్నాడని చినయ్యకు, పెద్దయ్యకు ఇమామ్‌కు ఎవరికైనా చెప్పాలి. ఎట్లా!

ఎవరో కని ఎక్కడ పారేస్తేనో పెరిగాడు, కడుపు నిండటమే సుఖమనుకున్నాడు. ఒంటికి బట్టా, నిలువ నీడ కూడా యిచ్చాడు. అయన్నేమనాలి! ఒక్క మాట పలికింది వాడి నోట.

ఓహో దైవమా! ఎంత దయామయుడివి. మేజస్ట్రేట్‌గారికి కళ్ళజోడు వున్నది. ఆ ఇంట్లో ఆయనొక్కడికే కళ్ళజోడు. వాడికి పలికిన పేరు పెట్టాడు. అది ముందుగా అర్థమైంది ఇమామ్ ఒక్కడికే.

"క....న్నా....డీ....క....న్నా....డి"

మేజస్ట్రేట్‌గారికి ఎదురుగా కూర్చునేవాడు. ఆయన తలెత్తి చూస్తే ఆయనకు మంచినీళ్ళు కావాలో, కాఫీ కావాలో, సిగరెట్ అందించాలో వాడికి తెలిసేది.

'కన్నా....డీ' వాడి బహిర్‌ప్రాణం.

అయన కసలు ఎవరితోను మాటాడే అలవాటు లేదు. వీడిలో అంతకన్నా లేదు.

పోలీసులు లేరు, జైళ్ళు లేవు. అన్నం వుంది. పడుకునేందుకు చోటుంది. వానొస్తే తడవక్కర్లేదు, ఎండొస్తే ఎండక్కర్లేదు.

రెండోనెలలో వాడిపేరున బ్యాంక్ ఖాతా వచ్చింది. నెలకు వదో పరకో జమ అవుతున్నది. ఆ రోజునే "కన్నాడీ" మాటాడాల్సొచ్చింది. "ఒరేయ్‌చూశావా?"

అయోమయంగా చూశాడు వాడు. ఇమామ్ చేతిలో పుస్తకం. నెలనెలా వాడికి డబ్బు జమవుతుంది. రెండేళ్ళు గడిచాయి. తాత్కాలికంగా పంకాలాగే ఉద్యోగం వచ్చింది. మూగవాడు ఉద్యోగి అయ్యాడు! !

డబ్బు తీసుకెళ్ళి బ్యాంక్‌లో వేసేవాడు ఇమామ్! ఆరోజు వాడికేదో తెలిసింది.

"కన్నా....డీ..." పిలిచాడు వాడు. అందరూ వొణుకుతూ 'దొరగారు' అంటే వీడు మాత్రం

క....న్నా....డీ....అనగలిగాడు.

తలెత్తి చూసారు మేజస్ట్రేట్‌గారు. కళ్ళల్లో నీళ్ళు. వంగి పాదాలు కళ్ళకద్దుకున్నాడు. మళ్ళీ శబ్దం చేశాడు.

"క.....న్నా.....డీ....."

ఆయన చండశాసనుడు – కబుర్లలో నమ్మకంలేదు. 'ఒరే పిచ్చినన్నాసీ!' అన్నారు. ఆయన గొంతులోనూ జీర పలికింది.

రోజులు దొర్లుతున్నాయి. జీతం

బ్యాంక్‌లో జమవుతున్నది. పాకెట్ మనీ ఇస్తున్నారు.

వాడు బీడీలు కాలుస్తున్నాడు! కన్నాడీ కొడతానని గుడ్లురిమాడు. ఒణికిపోయాడు.

కోపంవస్తే కన్నాడీ కళ్ళు ఎలా వుంటాయో తెలిశాక తప్పుచేయలేదు.

అయితేనేం పదిహేనేళ్ళు. తల్లీతండ్రీ లేని మూగవెధవ. ఏ పాత స్నేహాలు గుర్తుకొచ్చాయో! ఒక రాత్రి వుడాయించాడు.

వాడి అదృష్టం! మరునాడే పోలీసులు పట్టుకున్నారు. పాత దొంగ కదా!

ఎదుటపడగానే రక్షకభటులు మాట మరచి బూటు విప్పారు మేజస్ట్రేట్‌గారు.

'క....న్నా....డీ....' బేర్‌మని అరచి కాళ్ళమీద పడ్డాడు.

కన్నాడీ మనసు కరిగింది. ఏం చేశాడో! నిజంగా చేశాడా!

"నా ఇంట పనికి చేరాడు. ఇప్పుడు వుద్యోగం చేస్తున్నాడు, వదిలేయండి" అన్నారు.

'చిత్తం.... చిత్తం....' వదిలేశారు.

అది మొదలు వాడిల్లు వదల్లేదు. అయిదేళ్ళు ఆ ఇంటనే ఉన్నాడు.

మేజస్ట్రేట్‌గారికి బదిలీ అయింది. అయినా కుటుంబం అక్కడే వుండిపోతున్నది.

వాడికి తెలిసింది! ఇమామ్‌ను అడిగాడు.

"అయ్య నాలుగు రోజుల కెళ్ళిపోతారు" వేళ్ళతో నాలుగురోజులు తెలిసేటట్లు చెప్పాడు. 'నువ్వు ఇక్కడే వుండిపోరా' అన్నాడు.

మూగవాడు మాట్లాడలేదు. చదువుల కోసం వుండిపోతున్నది. మేజస్ట్రేట్‌గా రొక్కరే ఉద్యోగ నిర్వహణకోసం వెళ్తున్నారు. ఆ రాత్రి సామానంతా సర్దేశారు. మరునాడు పదిగంటలకు వారి ప్రయాణం.

ఆ రాత్రి.... భోజనంచేసి వరండాలో కొచ్చినవారిని చూచి—


'క.... న్నా.... డీ....' అన్నాడు వాడు.

అటు చూసారు. కాళ్ళు పట్టుకున్నాడు. అయన తేరుకొనేలోపల వాడి గుండెల్లో కృతజ్ఞత కరిగి కన్నీళ్ళయి ఆయన పాదాల నభిషేకించాయి.

"ఏమిటిరా! పిచ్చి సన్నాసీ! ఉద్యోగాలకు బదిలీ లుండవురా!? అంతా ఇక్కడే వుంటారు. నీకేం లోటు రాదురా!"

కృతనిశ్చయంతో లేచాడు వాడు.

"క.... న్నా.... డీ...." వేలితో చూపాడు వాడు. నీ దారి అటు. రైలు ఎక్కుతావు.... ఛుక్.... ఛుక్.... ఛుక్.... కన్నాడీ.... నేనూ వెళ్ళిపోతాను." వాడి భాషలో చెప్పాడో! అయనకు సగమర్థమైంది. మిగతా సగాన్ని ఇమామ్ తర్జుమా చేశాడు!




"మరి ఉద్యోగం వదులుకుంటావా?" ఇమామ్ నడిగారు ఆయన. మళ్ళీ మూగవాడి శబ్దాలు. అందరికీ అర్థమైంది ఒక్కమాటే! మిగతావి తెలియవు. పదిసార్లు క..... న్నా.... డీ.... అని వినిపించింది.

వాడేం చెప్పాడో ఇమామ్‌కు కూడా తెలియలేదు. ఎందుకైనా మంచిదని బ్యాంక్ ఖాతా మూసివేశారు. డబ్బంతా ఉదయమే తెచ్చారు.

అందరికీ తెలిసింది ఒక్కటే!

కన్నాడీతోనూ వెళ్ళను!

కన్నాడీ ఇక్కడ లేకపోతే, నేనూ వుండను!

"మరెలా బ్రతుకుతావురా?" అందరిదీ అదే ప్రశ్న! వాడెలా బ్రతుకుతాడో 'ఫిలాసఫీ అఫ్ ది రోడ్' వ్రాసిన క్లాడెస్లేజోన్స్‌కు తెలుసేమో!

వాడెలా బ్రతుకుతాడో ట్రాంప్ రాయల్ జాక్ లండన్‌కి తెలుసేమో! హాబో కింగ్‌గా బ్రతికిన మహారచయిత జాక్ లండన్‌కి తెలుసేమో!

ఉదయం తొమ్మిదైంది. శతాబ్దాల మానవ చరిత్రలో ఒకనాడు పందొమ్మిది వందల యాభై ఆరులో ఒకనాడు మామూలుగానే సూర్యుడు లోకాన్ని వెలిగించాడు.

అయ్యగారికి రిక్షా తెచ్చేందుకు ఇమామ్ వెళ్ళాడు. వీడ్కోలు చెప్పేందుకు అందరూ నిలబడ్డారు. ప్రక్కనే మూగవాడు. పిలిచి అయ్యగారు వాడి చేతిలో నోట్లు పెట్టారు వాడంతవరకూ ఎన్నడూ చూడనన్ని! అవి వాడివే!

రెండు చేతులూ వెనక్కి లాక్కొని అడ్డంగా తలతిప్పి చేతులూపి సంజ్ఞలూ శబ్దాలూ చేశాడు. 'క నా.....న్నా.....డీ.....' అని కాళ్ళద్దుకున్నాడు.

ఇమామ్ వచ్చి నోట్లు జేబులో కుక్కాడు. వాడి పక్కచుట్టా చిన్న ట్రంక్ పెట్టా తెచ్చుకున్నాడు. అవి నెత్తిన పెట్టుకొని రిక్షా వెనకే పరుగెత్తాడు మూగవాడు, స్టేషనుదాకా! కన్నాడీ రైలు తూర్పుగా వెళ్ళింది. మూగవాడి రైలు ఎటు వెళ్ళిందో!